కవల పిల్లలకు జన్మనిచ్చి.. అనంతలోకాలకు

- గుండెపోటుతో మృతి చెందిన బాలింత
- తల్లిని కోల్పోయిన ఇద్దరు కవల పిల్లలు

మృతి చెందిన పచ్చిబాలింత వాగ్మారే దీక్ష.. తల్లిని కోల్పోయిన కవల పిల్లలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 24 : అందునాయక్‌తండా కు చెందిన వాగ్మారే గోవింద్‌కు బుర్సన్‌పటార్ గ్రామానికి చెందిన దీక్ష(28)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. దీక్ష భర్త వాగ్మారే గోవింద్ రోజువారి కూలీ పనులతోపాటు ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అదేవిధంగా గోవింద్ భార్య దీక్ష తల్లిదండ్రులకు బుర్సన్‌పటార్ గ్రామంలో సరైన ఉపాధితోపాటు పనులు లేకపోవడంతో జీవనోపాధి కోసం బుర్సన్‌పటార్ గ్రామం నుంచి నిర్మల్‌కు వెళ్లి అక్కడే పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. మండలంలోని అందునాయక్‌తండా గ్రామానికి చెందిన వాగ్మారే గోవింద్ భార్య వాగ్మారే దీక్షకు పురిటి నొప్పులు రావడంతో భర్త గోవింద్ దీక్షను ఈ నెల 22వ తేదీన నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేయగా.. ఇద్దరు కవల మగ పిల్లలకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో దీక్షకు 23వ తేదీన రాత్రి గుండెపోటు రావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పుట్టిన ఇద్దరు కవల పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలింత మృతిచెందడంతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అముముకున్నాయి.

68 శాతం మందికి మాఫీ కాలే

- 784 మందికి 248 మందికే మాఫీ
- సోన్ మండల కేంద్రంలో తీరని రుణం
- బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

బాధితుడి ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ

ముథోల్‌లో చోరీ

ముథోల్, ఆగస్టు 24 : ముథోల్‌లోని సాయి మాధవ్ నగర్ కాలనీలో గల మేదరోల్ల వెంకటేశ్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెంకటేశ్ తన పనుల నిమిత్తం శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లి మరుసటి రోజు వచ్చి చూడగానే ఇంటి తాళం పగలగొట్టి మరో తాళం వేసినట్లు గమనించాడు. వెంటనే పోలీసులు సమాచారం అందించారు. ఏడు తులాల బంగారంతోపాటు కొంత నగదు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. చోరీకి గురైన ఇంటిని భైంసా అదనపు ఎస్పీ అవినాశ్ కుమార్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాఫీ కోసం వస్తే స్టేట్‌మెంట్ ఇస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణాలు మాఫీ అయ్యాయా అని బ్యాంకుకు వెళితే అధికారులు రుణాలు మాఫీ కాలేవని స్టేట్‌మెంట్‌లు చేతిలో పెడుతున్నారు. నాకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. క్రాప్ లోన్ కింద రూ.1.48 లక్షలు బ్యాంకులో అప్పు తీసుకుని పంటలు పండిస్తున్నా. ఇప్పటికే వ్యవసాయ సాగుకు బయట రూ.80 వేలు అప్పు తీసుకున్నా. రుణం మాఫీ కాకపోతే అప్పుల్లో కూరుకుపోతా. కాంగ్రెస్ సర్కారు వెంటనే రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలి.

- గంధం వెంకట నారాయణ, సోన్.

బ్యాంకు వద్ద రుణాలు మాఫీ కాలేవని బ్యాంక్ స్టేట్‌మెంట్ చూపుతున్న రైతులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 24 : నిర్మల్ జిల్లాలోని సోన్ మండల కేంద్రంలో 90 శాతం మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. పేద రైతులు కావడంతో బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకుంటూ పంటలు పండిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. కొన్ని రోజుల క్రితం విడుతలవారీగా ప్రభుత్వం రుణాలను మాఫీ చేసింది. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణాల మాఫీ ప్రకటించినా సోన్ మండలంలోని కొంత మంది రైతులకు రుణాలు మాఫీ కాకపోవడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. గ్రామంలో దాదాపు 784 మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా.. ఇప్పటివరకు దాదాపు 248 మంది రైతులకు మాత్రమే రుణాలు మాఫీ కాగా 536 మందికి రుణాలు మాఫీ కావాల్సి ఉంది.

బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించడంతో ఎంతో సంబరంతో బ్యాంకుకు వెళ్లిన రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. రుణాలు మాఫీ అవుతాయన్న ఆశతో బ్యాంకుకు వెళ్లిన రైతులు రోజూ నిరాశకు గురవుతున్నారు. నాట్లు వేసే సమయంలో పొలాల్లో ఉండాల్సిన రైతులు పనులను వదిలి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

కేసీఆర్ హయాంలోనే బాగుండే..

మాది సోన్ గ్రామం. నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. పంటలు పండించేందుకు లక్ష రూపాయల వరకు బయట అప్పులు ఉన్నాయి. బ్యాంకులో రూ.98 వేల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తారనుకుని సంబర పడ్డా. తీరా బ్యాంకుకు వచ్చి చూసే సరికి రుణాలు మాఫీ కాలేవు అంటున్నారు. కేసీఆర్ హయాంలోనే బాగుండే అప్పుడే మాకు రుణమాఫీ వచ్చింది. - గంగారావు అమృత్, రైతు, సోన్.

బ్యాంకుల సుట్టే తిరుగుతున్న..

సారూ. మాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. పంటలు పండించేందుకు రూ.1.58 లక్షలు బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకున్న. పేద రైతులను కావడంతో రూ.2లక్షల వరకు రుణం మాఫీ అవుతాయని అనికుని సంబురపడ్డా. తీరా బ్యాంకుకు వస్తే మీ రుణం మాఫీ కాలేదని బ్యాంకు అధికారులు అంటున్నరు. పొలం పనులు వదులుకుని బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా. అయినా మాఫీ కాలేదు. - బి.తిరుపతి, సోన్.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..

సోన్ మండలంలోని రైతులకు ఆధార్ కార్డు, పట్టాపాస్ బుక్‌లలో తేడాలు, డీబీటీ ఫెయిల్ కావడంతో ఇండియన్ బ్యాంకులో రైతుల వివరాలను పరిశీలించగా నో డాటా ఫౌండ్ అని వస్తుంది. ఈ విషయంపై కమిషనరేట్ అధికారులకు విన్నవించాం. మొదటి ఫేస్‌లో రైతులు ఎవ్వరికి రుణాలు మాఫీ కాకపోవడంతో ఖాతాల వివరాలను రెక్టిఫైడ్ చేయడంతో 200 మంది రైతులకు రూ.1.97 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రుణాలు మాఫీ కాని రైతుల నుంచి రైతు వేదికల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. వివరాలు పరిశీలించి వీరందరికీ రుణాలు మాఫీ అయ్యేలా చూస్తాం. - వినోద్, ఏవో, సోన్.

మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు

కొనసాగుతున్న ఇండక్షన్ ప్రోగ్రాం

బాసర, ఆగస్టు 24 : ఆర్జీయూకేటీ బాసరలో ఇండక్షన్ ప్రోగ్రాం కొనసాగుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జీయూకేటీ అధ్యాపకుడు చంద్రశేఖర్‌రావు, అసోసియేట్ డీన్ అకాడమిక్స్ అండ్ ప్లానింగ్ విజయ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు మంచి ఇంజినీరింగ్ నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్‌కుమార్, ఈసీఈ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

శనివారం సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. వీణ విద్వాంసులు శ్రీనివాస్, వయోలిన్ విద్వాంసులు పవన్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం అందరిని ఆకట్టుకున్నది. అనంతరం వీణ నేర్చుకునే విద్యార్థులతో మాట్లాడి వాళ్ల పట్టుదలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేటివ్ డీన్ పావని, స్పీక్‌మన్ నేషన్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ భట్నాగర్, కాలపూర్ణ, తెలంగాణ స్పీక్‌మైకే చైర్మన్ ప్రొఫెసర్ గీత, సాంస్కృతిక పాత్రికేయులు నీలు, స్పీక్ మైకే కో-ఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, స్పీక్ మైకే హెరిటేజ్ క్లబ్ కో-ఆర్డినేటర్ శ్రావణ్, నాగలక్ష్మి, ఇండక్షన్ కో-ఆర్డినేటర్ కిరణ్, కౌన్సిలర్ శివకుమార్ విద్యార్థులున్నారు.

నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై చర్చా వేదిక

ఎదులాపురం, ఆగస్టు 24 : ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం-2024 చర్చా వేదిక కార్యక్రమంలో శనివారం కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, వివిధ సంఘాల అధ్యక్షులు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. చర్చా వేదిక ద్వారా వెల్లడైన అందరి అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు-2024పై ప్రజల నుంచి సీసీఎల్ఏ వెబ్‌సైట్ ద్వారా సూచనలు, సలహాలు స్వీకరించిందని గుర్తు చేశారు. జిల్లా స్థాయిలోనూ మేధావులు, రెవెన్యూ చట్టంపై అవగాహన కలిగి ఉన్న వారి అభిప్రాయాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. సేవలు సులభంగా, వేగంగా అందడంతోపాటు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందనిదన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 2 నుంచి 23 వరకు సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో అభ్యంతరాల స్వీకరణకు తమ అభిప్రాయాలను పోస్టు, వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భూమికి ఒక నంబర్ ఉండాలన్న ఉద్దేశ్యంతో భూధార్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. రైతు సంఘాల అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, బండి దత్తాత్రి మాట్లాడుతూ.. సెక్షన్ 2024లో 20 సెక్షన్‌లో ధరణి రద్దు చేయాలని, పార్ట్(బీ) పెండింగ్‌లో ఉన్న కేసులను, సాదాబైనామా ప్రకారం సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ చర్చా వేదికలో ఆదిలాబాద్, ఖానాపూర్ ఆర్డీవోలు వినోద్ కుమార్, జీవాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో రాం రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జ్వరంతో ఒకరి మృతి

రంజిత్(ఫైల్)

ఖానాపూర్, ఆగస్టు 24 : పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన తొంటికురి రంజిత్(27) శనివారం ఉదయం తీవ్ర జ్వరంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా జ్వరం రావడంతో స్థానికంగా చికిత్స పొందాడు. నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి

ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టాలి

ముథోల్, ఆగస్టు 24 : ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు. శనివారం ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇచ్చిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. పనుల వివరాలను ఏపీవో శిరీషను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముథోల్‌లోని ఖజానా చెరువు కాలువ వద్ద మొక్కలు పెట్టడానికి అనువుగా ఉందో లేదో పరిశీలించినట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో శివకుమార్, ఈవో ప్రసాద్ గౌడ్ ఉన్నారు.

తూకంలో అవకతవకలు

- తక్కువ రావడాన్ని గుర్తించిన గ్రామస్తులు
- తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు

దస్తురాబాద్, ఆగస్టు 23 : హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ తూకంలో జరుగుతున్న అవకతవకలను శుక్రవారం దస్తురాబాద్ గ్రామస్తులు గుర్తించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ వాహనం వచ్చింది. సిలిండర్ తీసుకున్న వినియోగదారులు సిలిండర్ బరువు తక్కువ ఉండడాన్ని గమనించి తూకం వేశారు. తూకం తక్కువ రావడంతో మరిన్ని సిలిండర్లను తూకం వేశారు.14 కేజీల సిలిండర్‌కి సుమారు 5 కిలోల తక్కువ బరువు రావడంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ ఘటన స్థలానికి చేరుకున్నాడు. తూకం తక్కువ రావడాన్ని ఎస్ఐ పరిశీలించాడు. సిలిండర్ల వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు తరలించారు. అనంతరం ఎస్ఐ, తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయ్ అధికారి(డీటీ)కి సమాచారం ఇచ్చినట్లు తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ తెలిపారు.

సిలిండర్ తూకాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాహుల్ గైక్వాడ్

క్లిక్.. క్లిక్..

మూడో అంతస్తులో ఉన్న మిషిన్స్ పాకేజింగ్ ఫ్రేమ్‌లు

గుట్కా మరకలు

గుట్కా ఉమ్మిన చోట చల్లిన బ్లీచింగ్ పౌడర్

నిరూపయోగంగా వాటర్ ఫిల్టర్

రిమ్స్ అధ్వానం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో మూడో అంతస్తులో నిరుపయోగంగా ఉంచిన ఇనుప మంచాలు

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లో పారిశుధ్యం లోపించింది. రోగాలను నయం చేసుకోవడానికి దవాఖానకు వస్తే వ్యాధులు అంటుకునే పరిస్థితి దాపురించింది. మూడో అంతస్తులోని ఖాళీ స్థలంలో ఉంచిన గుట్కా, మరమ్మతుకు నోచుకోని మంచాలు, పరుపులు, ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. మొత్తం చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. రిమ్స్‌లో పారిశుధ్య పనులు చేపట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. - ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 24

స్లాబ్‌పై పడేసిన పరుపులు, చెత్తాచెదారం

మరుగుదొడ్డి